క్లుప్తంగా

ఆదమరిస్తే ప్రమాదమే..



రోడ్డు మధ్యలో ఎయిర్‌వాల్

తుక్కుగూడ: తుక్కుగూడ పురపాలిక పరిధి సర్దార్‌నగర్ నుంచి రావిర్యాల గ్రామానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన తాగునీటి ఎయిర్ వాల్ ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. గతంలో రోడ్డు పక్క నుంచి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా పైపులైన్ వేశారు. కాలక్రమేణా రోడ్డు విస్తరణలో భాగంగా ఎయిర్‌వాల్ రహదారి మధ్యలో ఉండిపోయింది. ఇది వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం ఆదమర్చినా, అప్రమత్తంగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధికారులు స్పందించి దీనిని రోడ్డు పక్కకు మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



వన మహోత్సవంలో కమిషనర్ వాణి, సిబ్బంది

తుక్కుగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందులో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె పురపరిధి రావిర్యాల చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మహోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటామన్నారు. ప్రస్తుత ప్రణాళిక 59వ రోజుకు చేరుకుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ యాదయ్య, ఏఈ పి.గుణాకర్, మేనేజర్ సామిక్ కుమార్, ఆర్ఐ.మల్లేశ్, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రోడ్డు పక్కన వ్యర్థాల డంప్



ఫార్మా రహదారి పక్కన పారబోసిన వ్యర్థాలు

కందుకూరు: ఫార్మా రహదారి ప్రస్తుతం డంపింగ్ యార్డుగా మారింది. కందుకూరు పరిధి కర్మాగారాల్లో వెలువడిన వ్యర్థాలను ఇలా గుట్టు చప్పుడు కాకుండా రాత్రికిరాత్రే నిర్వాహకులు వాహనాల్లో తెచ్చి ఇలా రోడ్డు పక్కన పారబోస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రహదారిపై అంతగా రాకపోకలు ఉండకపోవడంతో వ్యర్థాల డంప్ చేయడం సులభంగా మారింది. గతంలో హైదరాబాద్ పరిసరాల్లో పట్టుకున్న వీధి కుక్కలను రాత్రి వేళలో ఫార్మా రహదారిపై వదిలివెళ్లిన సందర్భాలు చాలా ఉన్నాయి. అధికారులు స్పందించి విచారణ చేపడితే.. వ్యర్థాల పారబోత బాధ్యులు ఎవరో తెలుస్తుందని, అప్పుడే ఇలాంటి పునరావృతం కాకుండా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఏపీఎంకు సన్మానం



ఏపీఎం కవిత దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

కందుకూరు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో విధులు నిర్వర్తించే మండల సమాఖ్య ఏపీఎం కవిత కేశంపేట మండలానికి బదిలీ అయ్యారు. దీంతో గురువారం సాయంత్రం కవిత దంపతులను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మహిళల అభివృద్ధికి ఆమె చేసిన సేవలను ఎంపీడీఓ సరిత ఈ సందర్భంగా కొనియాడారు. నేదునూరు, గుమ్మడవెల్లి బ్యాంకుల మేనేజర్లు రాధాకృష్ణ, ప్రసాద్, సీసీలు రాజాబాబు, మాధవి, మైసయ్య, గణేష్, ప్రభాకర్, శ్రీలత, ధనలక్ష్మీ, శ్రీహరి, హైమావతి, యాదయ్య, వీఓఏలు సరస్వతి, శారద, రాజేశ్వరి, మల్లేశ్, మండల మహిళా సమాఖ్య, గ్రామ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో కార్మికులకు మాత్రమే అందజేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 4వ డివిజన్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో తడి, పొడి చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు.

ఆపద కాలంం.. అప్రమత్తం

- మున్సిపాలిటీ అధికారుల బస్తీబాట
- వేగంగా పారిశుద్ధ్య పనులు
- సీజనల్ వ్యాధులపై అవగాహన
- ముంపు ప్రాంతాల ప్రజలకు మేలుకొలుపు



సరూర్‌నగర్‌లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

హుడాకాంప్లెక్స్: నిన్న మొన్నటి వరకు కార్యాలయానికే పరిమితమైన మున్సిపాలిటీ అధికారులు బస్తీ బాట పట్టారు. వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. రోజుకో కాలనీ, బస్తీ తిరుగుతూ ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పేరుకు పోయిన చెత్తను తొలగింపచేయిస్తూ.. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజా సమస్యలు వింటూ.. ఆపద కాలం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

చిన్న వర్షం.. పెద్ద ప్రమాదం

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, వేంకటేశ్వర్ కాలనీ, చెరుకుతోట కాలనీ, హుడాకాలనీ, పంజాల అనిల్‌కుమార్ కాలనీ, శ్రీరాంనగర్, లక్ష్మీనగర్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, డాక్టర్స్ కాలనీలు జేబీ కాలనీలు ఉన్నాయి. ఒక్కో కాలనీల్లో 500 నుంచి 600 నివాసాలు ఉన్నాయి. సుమారు లక్ష జనాభా ఉంటుంది. అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, జేబీకాలనీ సహా వేంకటేశ్వరనగర్‌లోని కొంత భాగం ముంపు ప్రాంతంలో ఉంది. చిన్న పాటి వర్షాలకు భారీగా వరద పోటెత్తుతోంది. ఇళ్లను ముంచెత్తుతుంది.

కునుకు కరువు

అసలే వర్షాకాలం. ఆపై అపరిశుభ్రతతో ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారం.. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిల్వ ఉండటం వలన దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో స్థానికులకు కంటిమీద కునుకు కరువైంది. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో పాటు వాంతులు, విరేచనాలు తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో.. అధికారుల పర్యటన కాస్త ఊరటనిచ్చింది.

బృందాలుగా ఏర్పడి..

పారిశుద్ధ్య, హార్టికల్చర్, ఎంటమాలజీ తదితర విభాగాల అధికారులు బృందాలుగా ఏర్పడి రోజుకో ఏరియాలో పర్యటిస్తున్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపుతున్నారు. మరికొన్నింటికి నివేదికలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపుతున్నారు.

వ్యాధులు విజృంభించకుండా



వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నాం. క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలు తెలుసుకుంటున్నాం. పారిశుద్ధ్య పనులు చేపడుతూనే.. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అక్కడికక్కడే కొన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతున్నాం.

– సుజాత, డిప్యూటీ కమిషనర్, సరూర్‌నగర్ సర్కిల్

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్



కాంట్రాక్టర్లకు కానుకలు అందజేస్తున్న భారతి సిబ్బంది

తుక్కుగూడ: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్ పేరు ప్రఖ్యాతులు పొందిందని ఆ సంస్థ మేనేజర్ సునీల్ తెలిపారు. గురువారం తుక్కుగూడ పురపాలిక కేంద్రంలో కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో.. మార్కెట్లో లభించే ఇతర సంస్థలతో పోల్చితే.. దృఢమైన నిర్మాణంతో పాటు.. ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, వంతెన నిర్మాణాలకు సరైన ఎంపికన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, నిర్మాణ సమయంలో సంస్థ నిపుణులు సైట్ వద్దకు వచ్చి పర్యవేక్షిస్తారని వివరించారు. ఇతర సంస్థల సిమెంట్ కంటే భారతి అల్ట్రాఫాస్ట్‌కు అధికంగా రూ.20 ఉంటుందని చెప్పారు. సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ హసన్‌ఖాన్, టెక్నికల్ ఇంజినీర్ మహమ్మద్ సాహేర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



చండీ హోమంలో మాజీ కార్పొరేటర్ మల్లేశ్ ముదిరాజ్ దంపతులు తదితరులు

మీర్‌పేట: మీర్‌పేట అయోధ్యనగర్ కాలనీలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయ 4వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ దంపతులు, కాలనీవాసులు పెద్దసంఖ్యలో హాజరై ఆలయ ఆవరణలో గణపతి, చండీ హోమాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పూజల్లో స్థానిక నాయకులు ఇంద్రావత్ రవినాయక్, శ్రవణ్‌కుమార్, పల్లె జంగయ్యగౌడ్, మాదరి శ్రీనివాస్, క్లెం వెంకట్‌రెడ్డి, జానయ్య, మూర్తి, టింకు, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్‌ను పలువురు బీజేపీ నాయకులు గురువారం స్టేషన్ ఆవరణలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీర్‌పేట-1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అందరినీ సమానత్వంతో చూడాలని, శాంతిభద్రతల విషయంలో తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, తిరుపతిరెడ్డి, రవినాయక్, సిద్దాల శ్రీనివాస్, కీసర హరినాథ్‌రెడ్డి, భీంరాజ్, నీలారవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

దృష్టి మరల్చి ఆభరణాలు తస్కరిస్తున్న ఇద్దరి రిమాండ్

సైదాబాద్: తమ ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వారి దృష్టి మరల్చి బంగారు ఆభరణాలు తస్కరిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. సైదాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వివరాల ప్రకారం.. యంజాల్‌కు చెందిన రైతు మోహన్‌రెడ్డి గత నెల 10న ఐఎస్‌సదన్ చౌరస్తాలో యంజాల్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అయితే ఆటోలో ఒక వ్యక్తి అటు ఇటు కదులుతూ ఇబ్బంది పెడుతుంటే ఆటోను చంపాపేట వద్ద ఆపి అతడు దిగిపోయాడు. కాసేపటి తర్వాత చూసుకుంటే తన మెడలోని 17 గ్రాముల బంగారు గొలుసు కనపడలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు హఫీజ్ బాబా నగర్‌కు చెందిన మహ్మద్ ఖలీద్ (26), ఎండీ ఫిరోజ్ (30)లను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇరువురు ఇదే తరహా పహాడీషరీఫ్, అత్తాపూర్ పీఎస్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి నుంచి చోరీకి ఉపయోగించిన ఆటో, 14 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు డీఐ తెలిపారు.

లక్ష్యసాధనకు ఇష్టంతో చదవాలి



విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మలక్‌పేట: లక్ష్య సాధన కోసం విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని మలక్‌పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. విజయలక్ష్మి అన్నారు. పదవీ విరమణ సందర్భంగా స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, గురువుల మాటలకు లోబడి ఉండాలని సూచించారు. పదవీ విరమణ చేసినప్పటికీ విద్యార్థులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

బాగ్‌మూసారిమో ఉన్నత పాఠశాలలో..

మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని బాగ్‌మూసారిమో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరునగరి రాధాకృష్ణ గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. సైదాబాద్ డిప్యూటీ ఈవో, హెచ్ఎంగా రాధాకృష్ణ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అంజనేశ్వర్‌రావు, మందడి వెంకట్‌రెడ్డి, పి. వెంకట్‌రెడ్డి, వెంకటేష్, సతీష్, శ్రీవాణి పాల్గొన్నారు.

ప్యూరో నాచురల్ ఉద్యోగి ఔదార్యం



నందినిని సన్మానిస్తున్న స్టోర్ యాజమాన్యం

దిల్‌సుఖ్‌నగర్: నిత్యవసరాలు కొనుగోలు చేసేందుకు స్టోర్‌కు వచ్చిన వినియోగదారుడి బంగారు ఉంగరం పడిపోగా అందులో పని చేసే సిబ్బంది అందజేసి తన ఔదార్యాన్ని చాటుకుంది. ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని ప్యూరో నాచురల్‌కి సరుకులు కొనడానికి వచ్చిన ఓ వినియోగదారుడి బంగారు ఉంగరం అక్కడే పడిపోయింది. గమనించిన ఉద్యోగి నందినికి ఆ ఉంగరాన్ని యాజమాన్యానికి అందజేసింది. ఇంటికి వెళ్లిన తర్వాత చూసుకున్న వినియోగదారుడు వెంటనే స్టోర్‌కు వచ్చి ఈ విషయం చెప్పగా వెంటనే అతడికి ఉంగరం అందజేశారు. నిజాయితీతో ఉంగరాన్ని ఇచ్చిన నందినిని నిర్వాహకులు సన్మానించి రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు.

పర్మిషన్ లేని ఇనిస్టిట్యూట్లను రద్దు చేయాలి



ఇనిస్టిట్యూట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులు

మలక్‌పేట: పారా మెడికల్ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులను మోసగిస్తున్న గ్రీన్ ఫీల్డ్, సిమ్స్ ఇనిస్టిట్యూట్లపై చర్యలు తీసుకోవాలని జేఎస్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సందీప్ డిమాండ్ చేశారు. మూసారంబాగ్‌లోని ఇనిస్టిట్యూట్ వద్ద విద్యార్థులతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా గ్రీన్ ఫీల్డ్, సిగ్మా, సిమ్స్ పేర్లతో బీఎస్సీ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని, తెలంగాణ పారామెడికల్ బోర్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తామని, నమ్మించి విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనలు, యూజీసీ మార్గదర్శకాలు లెక్క చేయకుండా ఇతర రాష్ట్రాల ప్రశ్నపత్రాలు, హాల్ టికెట్లు వాడుతూ తెలంగాణలో పరీక్షలు నిర్వహించడం నేరపూరిత చర్య అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యా మాఫియాను అడ్డుకోవాలని, బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో పవన్, విష్ణు, తేజ, ప్రేమ్‌కుమార్, కార్తీక్, మమత, శృతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాదర్‌ఘాట్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ తరుణి అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిల్వ ఆహార పదార్థాలను తినరాదని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా సొంత వైద్యం చేయకుండా బస్తీ దవాఖానా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.



డాక్టర్ తరుణి

గ్రామాభివృద్ధికి అడ్డుపడడం తగదు



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు శివకుమార్, పవన్‌కుమార్‌యాదవ్

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామ అభివృద్ధికి అడ్డు తగిలేలా వ్యవహరించడం బీజేపీ నాయకుడు మద్ది రాజశేఖర్‌రెడ్డికి తగదని బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్ కుమార్ యాదవ్ హితువు పలికారు. గ్రామంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా గ్రామంలోని భూములపై రాజశేఖర్‌రెడ్డి పదే పదే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడన్నారు. ఏమి ఆశించి ఇలా ఫిర్యాదు చేస్తున్నారని.. తాము చేసిన ఆరోపణలకు ఆయన అంజనేయస్వామి ఆలయంలో ప్రమాణం చేసి.. తమపై ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. ఆయన రాజకీయ జీవితంలో బాలాపూర్ మండలంలో ఎక్కడ కూడా ముడుపులు తీసుకోలేదా అనే విషయమై ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఒట్టు వేయడం, అనంతరం ఆ ఒట్టును గట్టు మీద పెట్టడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. విమానాశ్రయం ఏర్పాటు సమయంలో గ్రామంలోని ఎంతో మంది పేదవారు 99 సర్వే నంబర్‌లో నష్టపరిహారం కూడా తీసుకోకుండా భూములు కోల్పోయారన్నారు. గ్రామ ప్రజలపై ఆయనకు చిత్తశుద్ధి ఉందా.. అని ప్రశ్నించారు. తనపై వచ్చిన ఆరోపణలు నిరూపించుకోవాలే తప్పా.. ఏడుపులు, పెడబొబ్బలు పెడుతూ ఒట్టు వేసి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. గ్రామీణ వాతావరణం కలిగిన మామిడిపల్లిలో సొంత నిధులతో రూ.30 లక్షలు వెచ్చించి తరగతి గది నిర్మాణం, పండుగల సమయంలో ఖర్చులు, ఆలయాల అభివృద్ధిలో దాతగా వ్యవహరించినందుకు వైష్ణోయ్ గ్రూప్ యజమాని కృష్ణారెడ్డికి మద్దతు తెలిపామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. రోజు రోజుకు అభివృద్ధిలో దూసుకుపోతున్న మామిడిపల్లిలో రాజశేఖర్‌రెడ్డి లాంటి వారి చర్యలతో రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడిన వారు జీవనోపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఒకే కుటుంబానికి చెందిన పాలం పంచాయతీలను తీసుకొచ్చి గ్రామానికి రుద్ది రాద్ధాంతం చేయడం మానుకోవాలని పేర్కొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

- ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ
- నేటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

మహేశ్వరం: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి 7వ తేదీవరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో తల్లులు, బాలింతలు, గర్భిణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 234 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల గురించి తల్లులు, బాలింతలు, గర్భిణులకు సదస్సులు, శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.

కార్యక్రమాలు ఇలా..

1వ తేదీ శుక్రవారం గృహ సందర్శనాలు. దీనిలో భాగంగా మూడో త్రైమాసిక గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తారు. 0–24 నెలలు సామ్, మామ్ పిల్లల గృహాలను సందర్శించి తల్లిపాలు అనుబంధ ఆహారం గురించి వివరిస్తారు. 2వ తేదీ శనివారం గ్రామ, వార్డు స్థాయిలో తల్లిపాల గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 04వ తేదీ సోమవారం అన్నప్రాసనపై అవగాహన సదస్సులు. పూర్తి దృష్టి ద్వారా ఆరు నెలలలోపు బిడ్డలకు సరైన సమయంలో అనుబంధ ఆహారం మొదలుపెట్టడం. 05, 06వ తేదీలు మంగళవారం, బుధవారాల్లో 0–24 నెలల పిల్లలు ఉన్న ఇళ్ల సందర్శనలు చేస్తారు. తల్లులకు తల్లిపాలు, బంధం, ఫీడింగ్, ఫ్రీక్వెన్సీపై కౌన్సెలింగ్ ఇస్తారు. 07వ తేదీ గురువారం తల్లిపాల వారోత్సవాల గురించి స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తారు. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు పిల్లల ఆరోగ్యం, తల్లిపాలు, మహిళల సంక్షేమం గురించి వివరిస్తారని, ప్రతి ఒక్కరూ పాల్గొని సహకరించాలని ఆమె కోరారు.

సమస్యలు తెలుసుకునేందుకే యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో భాగంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టిందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడ పుర కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పాదయాత్రకు మద్దతుగా నియోజకవర్గం నుంచి కేఎల్లార్ నాయకత్వంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లామని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి ఆరా తీయడంతో పాటు, ప్రజా సమస్యలను గుర్తిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, భూపాల్‌రెడ్డి, రఘుపతి, వెంకట్, నర్సింహ్మాచారి, లాజర్, పాండు నాయక్, సమత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

- రేషన్‌కార్డుల దరఖాస్తుదారుల వివరాల సేకరణ
- మలక్‌పేట సర్కిల్–1లో సర్వేకు సిద్ధం
- ఆగస్టు పదిలోపు పూర్తి చేయాలని ఆదేశాలు



ఓల్డ్‌మలక్‌పేటలో ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

చాదర్‌ఘాట్: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొన్న వారిలో అర్హులను గుర్తించేందుకు ఈనెల 10 లోపు ఇంటింటికి సర్వే చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మలక్‌పేట సర్కిల్–పరిధిలోని మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, ఛావుని, సైదాబాద్, అక్బర్‌బాగ్ పరిధిలో ఉన్న 84 రేషన్ దుకాణాల పరిధిలోని దరఖాస్తు దారుల ఇంటింటికి సర్వే కోసం 40 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ప్రతి రోజు తమకు కేటాయించిన దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలు పరిశీలించి సంబంధిత అధికారికి రిపోర్ట్ చేస్తారు.

సర్కిల్–1లో 15600 దరఖాస్తుదారులు..

ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన, మీ సేవా కేంద్రాలు, వార్డు కార్యాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన వారికి లబ్ధి చేకూరగా వారందరికి గత నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు.మూడు నెలల నుంచి మీ సేవా కేంద్రాల ద్వారా మలక్‌పేట సర్కిల్–1లో దాదాపు 15600 దరఖాస్తులు అందాయి.జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయనున్నారు. జీహెచ్ఎంసీ ఇప్పటికే 40 మంది ఉద్యోగులను ఈ సర్వే కోసం కేటాయించగా వారంతా రేషనింగ్ మలక్‌పేట సర్కిల్ పౌర సరఫరాల శాఖ అధికారి నర్సింగ్‌రాజుకు రిపోర్ట్ చేశారు. తాజాగా చేపట్టిన ఇంటింటి సర్వేలో అర్హులను గుర్తించి కొత్త కార్డులు మంజూరు చేయనున్నారు.

మొసలి సంచరించే ప్రాంతానికి వెళ్లొద్దు



ఫారెస్ట్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీ అనుకుని వున్న మూసీ నది సమీపంలోకి ఎవరూ వెళ్లవద్దని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఫణిగిరి కాలనీ శివాలయం సమీపంలో మొసలి సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనలు గురవుతున్న నేపథ్యంలో గురువారం ఆయన ఫారెస్ట్ అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎవరూ నీటిలోకి వెళ్లకుండా బారికేడ్లు అడ్డం పెట్టించారు. మూసీ నది మధ్యలో ఉన్న శివాలయం వద్దకు ఎవరూ వెళ్లవద్దని, గడ్డి కోసేందుకు వెళ్లకుండా ఉండటం మంచిదన్నారు. మొసలిని బంధించి వేరే ప్రాంతానికి తరలించాల్సిందిగా ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట విఠల్‌రెడ్డి, మహేశ్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అజయ్, ప్రభు, శ్రీనివాస్, రామకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా ఐఎస్‌సదన్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. సింగరేణి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పుట్‌పాత్ నిర్మాణ పనులను గురువారం ఆమె కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సింగరేణి కాలనీ రోడ్ నెంబర్–14లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ స్థలం వద్ద ఏర్పాటు చేయనున్న ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, ప్రశాంత్, వెంకటరమణ, శైలజ, జయలక్ష్మి, ఆనంద్, బాలునాయక్ ఉన్నారు.